హైదరాబాద్ వార్త



### భార్యకు వీడియో కాల్ చేసి
## భర్త బలవన్మరణం

సరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త: కుటుంబ కలహాల కారణంగా పిల్లలను తీసుకొని భార్య పుట్టింటికి వెళ్లడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి భార్యకు వీడియో కాల్ చేసి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బడంగ్‌పేట్ అన్నపూర్ణనగర్ కాలనీలో నివాసం ఉంటున్న డ్రైవర్ మల్లా మోహన్ కృష్ణ (35)కు అతని భార్యకు మధ్య గత సంవత్సరం నుండి కుటుంబ కలహాలు ఉన్నాయి. దీంతో తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఆమె గత నెలలో పీర్జాదీగూడలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్ళింది. అయితే డిప్రెషన్‌లోకి వెళ్ళిన మోహన కృష్ణ మంగళవారం సాయంత్రం మద్యం సేవించి భార్యకు వీడియో కాల్ చేసి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 30 ప్రభాతవార్త : మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జీడిమెట్ల డివిజన్ పరిధి భాగ్యలక్ష్మీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న నాగేంద్ర(27) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. నాగేంద్ర బార్య నాలుగు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్ళింది. తండ్రి ఆరోగ్యం బాగుండక పోవడం, పని ఒత్తిడితో మనస్థాపానికి గురైన నాగేంద్ర ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కేంద్రం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయాలి

సైఫాబాద్, ఆగస్టు 30 ప్రభాతవార్త: కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అబద్దాలు చెప్పడంలోనూ, మోసం చేయడంలోనూ ప్రపంచంలోని హిట్లర్‌ను అధిగమించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఆరోపించారు. పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలు పెరిగినప్పుడు ఆ ధరల పెరుగుదలతో కే ంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని, కేవలం అయిల్ కంపెనీలు మాత్రమే స్వతంత్రంగా నిర్ణయిం తీసుకుంటాయని ధరలు పెరిగిన ప్రతిసారి కే ం ద్రం ప్రకటిస్తున్నదని ఆయన ఆరోపించారు. ఇలాంటి నిర్ణయాలతో కే ంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోదని గతంలో మోదీ ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. కాగా నేడు గ్యాస్ సిలీండర్‌పై 200 రూపాయలు తగ్గిస్తామని మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించడంలో నిజాయితీ ఎంత ? అని ప్రశ్నించారు. దేశ ప్రజలను మోసం చేసిన మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగానే వంటగ్యాస్ సిలీండర్‌ను 500 రూపాయలకు దేశప్రజలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు

## ఉస్మానియాలో మెరుగైన వైద్యం

### ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 30 ప్రభాతవార్త: ఉస్మానియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించడం జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ పేర్కొన్నారు.బుధవారం మెడికల్ గ్యాస్ట్రో డిపార్ట్‌మెంట్‌కు 64లక్షల విలువ చేసే పిడియాట్రిక్ ఎండోస్కొపి సిస్టంను,టిఎస్ఎంఐడిసి ద్వారా ఉస్మానియా ఆసుపత్రికి అందచేశారు. ఈ ఎండోస్కొపి ద్వారా పిడియాట్రిక్ గ్యాస్ట్రోకి సంబంధించిన వ్యాధులు గుర్తించడం జరుగుతుందన్నారు. పిడియాట్రిక్ గ్యాస్ట్రోకి డిఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి,నీలోఫర్ ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఉషారాణి, మెడికల్ గ్యాస్ట్రో హెచ్.ఓ.డి డాక్టర్ రమేష్,ప్రొఫెసర్ ఉమాదేవి,సి.ఎస్.ఆర్.ఓ డాక్టర్ శేషాద్రి, డాక్టర్లు సాయిశోభ,వివిధ విభాగాల అధిపతులు పాండునాయక్, బాలరాజ్, గీత,వెంకట కృష్ణ,గ్యాస్ట్రో అసోసియేట్ ప్రోఫెసర్ సాహిత్య పాల్గొన్నారు.

### నడుస్తూ కుప్పకూలిన వ్యక్తికి సీపీఆర్ చేసి
## ప్రాణాలు పోసిన పోలీస్ అధికారి



నడుస్తున్న క్రమంలో హఠాత్తుగా గుండె పోటు వచ్చి పడిపోయిన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

బేగంపేట ఆగస్టు 30,ప్రభాతవార్త : రోడ్డు పక్కనే నడుస్తూ హఠాత్తుగా గుండె పోటుకు గురై పడి పోయిన వ్యక్తికి అక్కడే విధులలో ఉన్న ట్రాఫిక్ ఏసీపీ మధుసూధన్ రెడ్డి స్వయంగా బాధితుడికి సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించిన ఘటన బుధవారం బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద చోటు చేసుకుంది.శ్రీకాకుళం జిల్లా కిందస ప్రాంతంలోని మెయిన్ వీధికి చెందిన తాపీ మేస్త్రీ గుజ్జల్లరాములు(60) బేగంపేట బ్రాహ్మణవాడీలో నివాసం ఉంటున్నాడు. పనికోసం రోజు అడ్డా వద్దకు వెళుతుంటాడు.ఈక్రమంలో హెచ్‌పీఎస్ ఫుట్ ఫాత్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న అతను ఒక్క సారిగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. ఆ సమయంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగా రావు పర్యవేక్షణలో ముఖ్యమంత్రి రూట్ బందోబస్త్ కోసం బేగంపేట ట్రాఫిక్ పోలీసులు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు.సమీపంలో ఉండి రాములు కింద పడిపోవడాన్ని గమనించిన ఏసీపీ మధుసూదన్ రెడ్డి రాములు వద్దకు చేరుకుని వెంటనే ఇతర పోలీస్ సిబ్బంది సాయంతో బాధితుడి గుండె నొక్కుతూ సీపీఆర్ చేసాడు.అనంతరం అతను తేరుకొవడంతో అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రాధమిక చికిత్స అనంతరం బాధితుడు ఇంటికి చేరుకున్నాడు. తమ తండ్రి పరిస్థితి మెరుగ్గానే ఉందని కుమారుడు అశోక్ తెలిపారు.అయితే సకాలంలో స్పందించి తన తండ్రి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ ఏసీపీ మధుసూధన్ రెడ్డి వారి సిబ్బందికి రాములు కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసారు.

## అన్నా చెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండగ

### నేడు రాఖీ పౌర్ణమి



హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త: రాఖీ, రక్షాబంధన్, లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో 'శ్రావణపౌర్ణమి' లేదా 'జంద్యాలపౌర్ణమి' అనికూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమాణురాగాలకు సూచికగా ఈ పండుగ జరుపుకుంటారు. కొంత కాలం క్రితం వరకు ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతా జరుపుకుంటున్నారు. అన్నకుగానీ, తమ్ముడుకి గాని ప్రేమసూచికంగా సోదరి కట్టేది రాఖీ. రాఖీ అనగా రక్షణబంధం ఇది అన్నా చెల్లెల్లు, అక్కాతమ్ములు జరుపుకునే మహోత్తరమైన పండుగ, చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ.

**రక్షాబంధన్ ఎలా ప్రారంభమైంది**

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం జరిగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారమంతటినీ కూడగట్టుకుని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సాహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం అలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకుని భర్త దేవేంద్రుడుకి సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆరోజు రావణపౌర్ణమి కావడంతో పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీ నారాయణులను పూజించి రక్షాను దేవేంద్రుడికి కడుతుంది. అదిగమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇం ద్రుడు తిరిగి త్రిలోవ ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం..నేడు రాఖీ పండుగగా ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి.

**ద్రౌపది-శ్రీకృష్ణుని బంధం**

ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపది, శ్రీకృష్ణుడికి అన్నాచెల్లెల్ల అనుబంధం అత్యంత గొప్ప అనుభందంగా కనిపిస్తుంది. శివపాలుడిని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణునికి చూపుడు వేలుకు రక్తం ధారాలంగా కారుతుందట, అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి వేలుకి కట్టడంవల్ల. దానికి కృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీ కృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు, అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడు. చరిత్ర పుటల్లో అలెగ్జాండర్ భార్య 'రోక్సానా' తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీకడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీ.పూ 326 లో భారతదేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బా క్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్తాన్) కు చెందిన యువరాణి రోక్సానాను వివాహం చేసుకుంటాడు. ఆమె వివాహసంభందాన్ని ఉపయోగించుకొని మధ్య ఆసియా దేశాలను ముఖ్యంగా జీలం, చినాబ్ నదుల మధ్యనున్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రురాజు అంబి, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తమని ఆహ్వానిస్తాడు. అయితే అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీకడుతుంది. తన సోదరుడిని చంపవద్దని తన భర్త అయిన అలెగ్జాండర్‌ను కోరుతుంది. దీంతో అలెగ్జాండర్ యుద్ధం విరమించుకుంటాడు.

ఈ రాఖీ పండుగ నాడు సోదరి రాఖీకట్టిన తర్వాత తలపెట్టే కార్యములు విజయవంతమై, సుఖసంపదలు చేకూరుతాయని విశ్వాసం. అలా రాఖీలు కట్టించుకున్న సోదరులు, తమ సోదరీమణులకు చిరుకానుకలు సమర్పించి అందరూ కలిసి భోజనం చేస్తారు. ఇకపోతే శ్రావణపూర్ణిమ రోజున బ్రాహ్మణులు నూతన జంధ్యాలు ధరిస్తారు. ఈ రోజున బ్రాహ్మణులు నూతన యజ్ఞోపవీతాధారణలు చేసి విద్యార్థులకు వేదపఠనం ప్రారంభిసారు, 'జంధ్యాపూర్ణిమ' అని పిలువబడే ఈ ప ండుగ కాల క్రమేనా 'రక్షాబందన్ మరియు రాఖీ' పండుగగా ప్రాచుర్యం పొందింది.

### ఆలయ ఆస్థాన ప్రబంధ
## నర్తనాలతో కూడింది ఆంధ్రనాట్యం



నాంపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ నృత్యాల్లో ఆలయ నర్తనం, ఆస్థానన ర్తనం, ప్రబంధనర్తనమనే మూడురీతులలో కూడిన ఆంధ్ర నాట్యం బహుళ ప్రాచుర్యం పొందడం చాలా ఆనందంగా ఉందని ప్రఖ్యాత ఆంధ్రనాట్య గురువులు డి.పద్మమోహన్, జి.సునీల, ఎం.స్రవంతిలు అన్నారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ప్రఖ్యాత నవ్యనాటక సమితి నిర్వహణలో గత 5రోజులుగా జాతీయస్థాయిలో జరుగుతున్న 48వ అకిలభారత సంగీత నృత్యప్రదర్శనలు-పోటీలకు న్యాయనిర్ణేతలుగా వారు వ్యవహ రించి ఆంధ్రనాట్యానికి విశేషమైన శైలి, అభినయం, లాస్యం, జతులు ప్రత్యేకత లున్నాయని ఆంధ్రనాట్య ప్రాచుర్యానికి కృషిచేసిన విశ్వవిఖ్యాత నాట్యగురువు నటరాజ రామకృష్ణ చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖకవి డా. ఆచార్య ఫణీంద్ర గౌరవ అతిథులు డా. నందూరి విద్యారణ్యస్వామి, ఎం.లక్ష్మీమానస. కులకర్ణి, నిష్ఠల సుధామాల, వి.విజయకుమార్, సుధారాణి, రేణుకా ప్రభాకర్ తదితరులతో కలిసి పలువురు నాట్యగురువులను ఘనంగా సత్కరించి దేశవిదేశాల్లో మన శాస్త్రీయ నృత్య సంగీతరీతులకు విశేష ఆదరణ లభించడం మనందరికీ గర్వకారణమని, సమితి వ్యవస్థాపకుడు వేమరాజు నరసింహారావు సాంస్కృతిక రంగానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈనాటి నృత్యపోటీల్లో ఆంధ్రనాట్యంలో సీనియర్స్, జూనియర్స్, సబ్‌జూనియర్స్ మొత్తం 33మంది కళాకారులు తమ అద్భుత కళాప్రదర్శనలతో అబ్బురపరిచి మంత్రముగ్ధులను చేశారు.

## యువతిపై నకిలీ బాబా అత్యాచారం

### పరారీలో నిందితుడు

చాంద్రాయణగుట్ట, ఆగష్టు 30 ప్రభాతవార్త : వైద్య చికిత్స పేరుతో నకిలీ బాబా ఓ యువతిపై అత్యాచారం చేసిన సంఘటన బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనిఆలం ప్రాంతానికి చెందిన యువతి మూడు నెలల క్రితం భవానీనగర్‌కు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఆమె ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో అత్తింటివారు ఈ నెల 20వ తేదిన బండ్లగూడ ప్రాంతంలో ఉంటున్న ఓ బాబా వద్దకు తీసుకువెళ్లారు. వైద్యం చేరుతో ఆమె కళ్ళకు గంతలు కట్టి గదిలో అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలిపింది. అత్తమామలకు ఈ విషయం చెప్పినా వారు పట్టించుకోకపోగా ఆమెకు దయ్యం పట్టిం దని ఇంట్లో బంధించారు. బాధితురాలు తల్లిదండ్రుల సహాయంతో భవానీనగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు ఈ కేసును బండ్లగూడ పోలీ సుస్టేషన్‌కు బదిలీ చేశారు. పరారీలో ఉన్న నకిలీ బాబా కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పేవన్ని అబద్ధాలే

### అంబర్‌పేటలో ఒక బ్రిడ్జి నిర్మించలేకపోయారు
### కాలేరును భారీ మేజార్టీతో గెలిపించాలి: మంత్రి తలసాని



సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి తలసాని, చిత్రంలో కాలేరు

హైదరాబాద్, ఆగస్టు 30 ప్రభాతవార్త:అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఎన్ని నిధులు కేటాయించారో బహిర్గతం చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డి మాటాలకు చేష్టలకు పొంతన లేదని ఆరోపించారు. బుధవారం తిలక్‌నగర్ పార్కులో నల్లకుంట వార్డు కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన ప్లైఓవర్‌లు పూర్తియి అందు బాటులోకి వచ్చాయని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్మిస్తున్న అంబర్‌పేట ప్లైఓవర్ పనులు అతిగతి లేదని నత్తనడకగా పనులు ఎందుకు కొనసాగుతున్నాయో కే ంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి డిమాండ్ చేశారు. కే ంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే అంబర్‌పేట ప్లైఓవర్ పనులు పూర్తి కావడం లేదన్నారు. ప్రతిపక్ష కార్పోరేటర్లు ఇళ్ళముందు ఇసుక, సిమెంట్ కనిపిస్తే చాలు ఈగలవలే వాలుతున్నారని మాముళ్ళు దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. డబుల్ బెడ్ రూంల గురించి మాట్లాడే హక్కు బిజెపి నేతలకు లేదని, పేద ప్రజలకు న్యాయం చేయాలనేదే సిఎం కెసిఆర్ లక్ష్యమన్నారు. వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతున్నాయని, దేశంలోనే కొత్త చరిత్రకు నాంది పలుకుతున్నామని చెప్పారు. అంబర్‌పేట నియోజకవరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను భారీ మేజార్టితో మళ్ళి గెలిపించాలని తలసాని పిలుపునిచ్చారు. కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ తొలి విడత అంబర్‌పేట నియోజకవర్గానికి 500 డబుల్ బెడ్‌రూంలు ఇళ్ళు వచ్చాయని సెప్టెంబరు 2న మెడ్చల్ జిల్లా ప్రతాప్ సింగారంలో ఈ ఇళ్ళను లబ్ధిదారులకు అందజేస్తా మన్నారు. నియోజకవర్గానికి మరో 3,600 ఇళ్ళు కేటాయించారని విడతల వారిగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంసి దివాకర్, యుసిడి అధికారిణి రజిత, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సందడిగా ఒయు ఇంజనీరింగ్ కళాశాలో బీఈ విద్యార్థుల ఓరియెంటేషన్



కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ తదితరులు

తార్నాక, ఆగస్టు 30 ప్రభాతవార్త : ఉస్మాయానియూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం బీఈ విద్యార్థుల ఓరియేంటేషనప్ కార్యక్రమంతో కళాశాల సందడిగా మారింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. శ్రీరాం వెంకటేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగ హాజరైన ఓ.యూ వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్ విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ విజ్ఞానంతో కూడిన జీవన నైపున్యాలను ఉస్మానియా యూనివర్సిటీ అందిస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్యతో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఐటీ, ఎస్ఐటీ స్థాయిలో వసతులను కల్పిస్తున్నామని వాటిని ఉపయోగించుకొని క్రమశిక్షణతో చదుకోని ఒ.యూకు, తల్లితండ్రులకు పేరు తీసుకొని రావాలని సూచించారు. ఎంసెట్ టాపర్స్ ఓ.యూ ఇంజనీరింగ్ కాలేజ్‌లో చేరుతారని ఇక్కడ ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపల్ శ్రీరాం వెంకటేష్ పేర్కొన్నారు. అకాడమిక్ ప్రక్రియలో భాగంగా కోర్ బ్రాంచ్ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇక్కడ చదువుకున్నవారు ఆల్‌రౌండర్‌గా తయారవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ, సినియర్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ కాజా, సీఈఓ సాయి గుండెవెల్లితో పాటు వైస్.ప్రిన్సిపల్ చంద్రశేఖర్, అలూమ్ని అధ్యక్షులు డా. విజయ్‌కుమార్, రమేష్, సాయిలతో పాటు విద్యార్థుల తల్లి,తండ్రులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న చెన్నయ్య,శ్రీధర్‌రావు, బైండ్ల శ్రీనివాస్

## బిఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం

### మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య

హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన అసెంబ్లీ స్థానాల్లో మాలలకు అన్యాయం జరిగిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏరాజకీయ పార్టీ అయినా మాలలను విస్మరిస్తే తగినగుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అలంపూర్, అచ్చంపేట ప్రాంతాల్లో మాలలకు అధికంగా ఉంటారని అయినప్పటికీ టికెట్ మాలలకు కేటాయించకుండా మాదిగలకు కేటాయించి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. దీనిపై సిఎం కెసిఆర్ పునరాలోచించి మాలలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జి.చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలోనూ 2014, 2018 ఎన్నికల్లోనూ అక్కడ టికెట్ ఆశించిన మాలకులస్తులకు అన్యాయం జరిగిందన్నారు. కావున తమడిమాండ్‌పై పునరాలోచన చేసి టికెట్ కేటాయించాలని లేకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీధర్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, సిటీ ప్రెసిడెంట్ గోకుల కెల్యున్, బండి ఆనంద్ కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాలు పంపిణీ



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడకల్లో జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, ఆగస్టు 30 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని 22.వ,వార్డు వినాయకనగర్‌లో బుధవారం మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకలలో భాగంగా జాతీయ పతాకాలను పంపిణీ చేసి, ప్రజలలో దేశభక్తిని పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామ న్నారు. వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రజలందరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాలు ఎగురవేయాలని సూచించారు. భావి భారత పౌరులైన బాలలకు దేశభక్తిని పెంచేందుకు తల్లిదండ్రులు,ఉపాధ్యా యులు కృషి చేయాల న్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా జాతీయ గీతం వినిపిస్తే లేచి నిలబడి గౌరవం ఇవ్వడం మన ధర్మంగా భావించాలన్నారు.

## టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారంజిత్‌రెడ్డిని కలిసిన జీఆర్ఆర్ టీం సభ్యులు

శేరిలింగంపల్లి, ఆగస్టు30 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డి సతిమణి గడ్డం సీతా రంజిత్‌రెడ్డిని జీఆర్ఆర్ టీం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.శేరిలింగంపల్లి నియోజక వర్గం నుంచి జీఆర్ఆర్ టీం నాయకులు గడ్డం సీతారంజిత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## జిందాబాద్‌లు పక్కనబెట్టి ప్రజలకు సేవ చేయడంలో పోటీ పడాలి

### రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి పద్మారావు గౌడ్



ప్రసంగిస్తున్న రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి పద్మారావు గౌడ్

చిక్కడపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త: రాజకీయ పార్టీలు జింబాద్‌లు పక్కనబెట్టి ప్రజలకు సేవ చేయడంలో పోటీపడాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి పద్మారావు గౌడ్ అన్నారు. పార్టీ జెండాలు ఎన్నికల వరకేనని, ఎన్నికల తర్వాత ప్రజాప్రతినిధులు అంతా ప్రజలకు సేవ చేయడానికి, గురుతరమైన బాధ్యతతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రజలకు మనమేం చేస్తున్నాం, వారి సమస్యలు ఎలా పరిష్కరించాలి అనే అంశంపై దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో రామ్‌నగర్ వార్డు కార్యాలయాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. సభకు జిహెచ్ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అధ్యక్షత వహించగా సభలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, జిహెచ్ఎంసి ఈఈ శ్రీనివాస్, డిఈలు సన్నీ, గీత, ఏఈ.మురళీ, వాటర్‌బోర్డు బాగ్‌లింగంపల్లి సెక్షన్ మేనేజర్ జీవనజ్యోతి, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ హాఫీజ్, వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బీమారావు, వార్డు ఇంజనీర్ బీసీ.మురళీకృష్ణ, యుసీడీ అధికారి మహ్మద్ ఉస్మాన్, సానిటేషన్ అధికారి పి.ఆంజనేయులు, ముఠానరేశ్, టెంపుల్ జనార్దన్, ఆర్.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వార్డు కార్యాలయంలో వివిధ విభాగాలను డిప్యూటీ స్పీకర్ పద్మారావు పరిశీలించి ప్రసంగించారు. ఎంతో ముందుచూపుతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వార్డుకార్యాలయాలు ప్రారంభించామని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి గతంలో వేరు వేరు ప్రాంతాల్లో ఉన్న వివిధ శాఖల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, వార్డు కార్యాలయాల ఏర్పాటుతో అన్ని శాఖ అధికారులు వార్డు కార్యాలయంలోనే అందుబాటులో ఉంటారని అన్నారు.

## ఇల్లు ఉన్నవారికే డబుల్‌బెడ్ రూమ్‌లు ఇస్తున్నారు

### మేయర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు



మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రాన్ని అందిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిల్మ్‌నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త : ఇల్లు ఉన్న వారికే మళ్ళీ డబల్ బెడ్ రూమ్‌లు మంజూరు అవుతున్నాయన్న సమాచారం తమ దగ్గర ఉందని జూబ్లీహిల్స్ కార్పోరేటర్ వెల్దండ వెంకటేష్ బుధవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్ళారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరులో జరిగిన లోటుపాట్లపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి 500 మందికి డబల్ బెడ్ రూమ్‌లను కలెక్టర్ మంజూరు చేయడం జరిగిందని, నిరుపేదలకు ఇల్లు రాలేదని, దీనిపై పునరాలోచన చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. స్థానిక శాసనసభ్యునికి కార్పోరేటర్‌లకు సమాచారం ఇవ్వకుండానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని మేయర్‌కు కార్పోరేటర్ ఫిర్యాదు చేశారు. ఒకవైపు దరఖాస్తుల పరిశీలన జరుగుతుంటే, వాటి ప్రక్రియ పూర్తి కాకుండానే అధికారులు అంతా తామై డబల్ బెడ్ రూమ్‌ల ప్రక్రియ పూర్తి చేశారని ఆరోపించారు. అధికారులు ప్రజా ప్రతినిధులకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వటంలేదన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడుతానని మేయర్ కార్పోరేటర్ వెల్దండ వెంకటేష్‌కు హామీ ఇస్తూ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారు.

# నిరంతరాయంగా అభివృద్ధి

**ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

అల్వాల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. బుధవారం మంగాపురం కాలనీలో 60లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న అంతర్గత రోడ్లు పనులకు స్థానిక కార్పొరేటర్ జితేందర్‌నాథ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గం సమాగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పన తన ధ్యేయమన్నారు. దశాబ్దాలు కాలంగా ఉన్న సమస్యలను తీర్చడం జరిగిందని వివరించారు. అభివృద్ధికి ప్రజలు సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ మహేష్, ఎఇ రవళి బిఆర్ఎస్ నేతలు సురేందర్ రెడ్డి, రాజసింహారెడ్డి, బల్వంత్ రెడ్డి, ఉదయ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, యువకులను ప్రభుత్వం మోసం చేస్తుంది



విద్యార్థులకు స్కాలర్షిప్‌లను అందజేస్తున్న నీలిమ

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 30, ప్రభాతవార్త : విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ప్రోత్సాహకంగా వారికి స్కాలర్షిప్‌లు ఇస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ కళాశాలలో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడి చదువుల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి బుధవారం రాజీవ్ గాంధీ మెరిట్ స్కాలర్షిప్‌లను కోట నీలిమా అందజేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి అందులో టాప్‌లో నిలిచిన వందమందిని ఎంపిక చేశారు. అమీర్‌పేట డివిజన్‌లోని కెకె ఫంక్షన్ హాల్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుందన్ యాదవ్, సనత్‌నగర్ ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు ఎన్.సుశాంత్, నాయకులు ప్రవీణ్, విజయ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కోట నీలిమ సమాధానాలు ఇచ్చారు. ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ కెసిఆర్ పాలనలో యువకులు విద్యార్థులు నిరాశ నిస్పృహాలో కూరుకుపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామి ఇచ్చారు. గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం విద్యార్థులను నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఘనంగా మేరీ మాతా పూజలు



పాత గాంధీ నగర్‌లోని వెలంగాని మాత ఆలయంలో ప్రార్థనల్లో పాల్గొన్న బిజెపి నాయకుడు శంకర్ రావ్

తిరుమలగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త: దేవాలయాల్లో ప్రార్థనలు చేయడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు బిజెపి నాయకుడు కె.బి.శంకర్ రావ్ అన్నారు. ఇందులో భాగంగా వార్డు పరిధిలోని పాత గాంధీ నగర్ వెలంగాని మాత ఆలయంలో మేరీ మాతా జెండాను చర్చిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మేరీ మాతా ఆలయాల్లో జెండా ఆవిష్కరణ చేశారన్నారు. 9 రోజులు నిర్వహించే ఈ జెండా పండగలో మేరీ మాతా భక్తులు ప్రతి రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మార్టిన్, లూతర్, రాఖేశ్, వాసుదేవన్, జీవన్, బాలక్రిష్ణ, కిరణ్, సూర్య నారాయణ, ప్రమోద్ కుమాం పాల్గొన్నారు.

# కళాకారులకు 30 శాతం పిఆర్సీ పెంపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న యశ్‌పాల్

సైఫాబాద్, ఆగస్టు 30 ప్రభాతవార్త: తెలంగాణ సాంస్కృతిక సారధిలో పని చేస్తున్న ఉద్యోగులకు సిఎం కెసిఆర్ 30 శాతం పిఆర్సి పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అభినేయ శ్రీనివాస్, యశ్‌పాల్ తదితరులు మాట్లాడుతూ గత 8 సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై 583 మంది కవులు, కళాకారులు ప్రజలకు ఆట పాటలద్వారా వివరించి, లబ్ధి పొందేలా సేవలు అందిస్తున్నారని చెప్పారు. కవులు, కళాకారుల కష్టార్జితాన్ని గమనించిన కెసిఆర్ 30 శాతం పిఆర్సీ పెంచారని, దీంతో ఒక్కొక్కరికి 8000 వేల రూపాయలకు పైగా వేతనాలు పెరుగుతాయన్నారు. వేతనాల పెంపుతో తమ కుటుంబాలలో వెలుగులు పెరిగాయన్నారు. తమపై నమ్మకం ఉంచి వేతనాలు పెంచిన కెసిఆర్ నమ్మకాన్ని వమ్ము చేయబోమని మరింత ఉత్సాహంతో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్రసాంస్కృతిక సారధి ఛైర్మన్ రసమయి బాలకిషన్, డైరెక్టర్ మామిడి హరికృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కోదారి శ్రీను, బోడ చంద్రప్రకాష్, మహిళా కార్యదర్శి జలజ, విద్యానందచారి, దేవత సుధాకర్, శ్రీనివాస్‌రాజు, బాలునాయక్, స్వప్న, అనూష తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మెహిదీపట్నం, ఆగస్టు 30, ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్య కర్తలు పనిచేయాలని ఖైరతా బాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి పిలునిచ్చారు. తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షులు కూరాకుల కృష్ణ ఆధ్వర్యంలో చేపట్టనున్న నియోజకవర్గ ఇంటింటి పాదయాత్ర బ్రోచర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రోహిన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పజలకిచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. అమలుకానీ హామీలను చెప్పి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి కేసీఆర్ గద్దెదిగే రోజులు దగ్గరపడ్డాయన్నారు. తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నా రు. అనంతరం కూరాకుల కృష్ణ మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి పాదయాత్ర నేటి నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ప్రజా సమస్య లను పరిష్కరించలేని ప్రభుత్వం వెంటనే గద్దెదిగాలన్నారు. కార్యక్రమంలో కార్వాన్ కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షులు చంటిబాబు, అఫ్సర్ యూసూఫ్‌జాహి, ముంగి రఘుపాల్‌రెడ్డి, ఆకుల చంద్రశేఖర్, అబ్దుల్ అహ్మద్, గిరి, గోవర్ధన్‌రెడ్డి, రామ్‌కుమార్, ప్రేమ్‌కిషోర్‌లు ఉన్నారు.

# అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి : జంపనప్రతాప్



1వ వార్డు బాపూజీ నగర్ నల్లపోచమ్మ అలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్, పరశరామ్ తదితరులు

కంటోన్మెంట్, ఆగస్టు 30 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని ప్రసిద్ధిగాంచిన శ్రీ నల్లపోచమ్మ అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, ఆర్.అండ్.బి.ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశరామ్‌లు తెలిపారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం బాపూజీ నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు వారుముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాల న్నారు. ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాల న్నారు. అనంతరం పేదలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఆసుపత్రి ఎండి నందికిషోర్, ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గాయ్య, శ్రీకాంత్, నర్సింగ్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా: మిత్ర కృష్ణ



మిత్ర కృష్ణను సన్మానిస్తున్న బస్తీ నాయకులు

మెహిదీపట్నం, ఆగస్టు 30, ప్రభాతవార్త : అదరించండి కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చేపిస్తున్నానని బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్ లక్ష్మీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వివిద బస్తీలకు చెందిన స్థానికులు మిత్ర కృష్ణను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి గడపకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకం అందని కుటుంబం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, దళితబంధు, బీసీ బంధు, రైతు రుణమాఫీ, రైతుభీమా, రాష్ట్రంలో 24 గంటల కరెంటు దేశంలోని ఏరాష్ట్రంలో లేవన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు కె. శేఖర్‌రెడ్డి, బంగారి ప్రకాష్, కావూరి వెంకటేష్, శేఖర్‌యాదవ్, చిరు రాజు, గడ్డి చందులు ఉన్నారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న ఆలయకమిటి సభ్యులు

జీడిమెట్ల, ఆగస్టు 30 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం మార్కెట్ రోడ్డులోని ఆనంద్‌నగర్‌లో చేపడుతున్న పోచమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మన్నేరాజు, రంగారావు, మక్సూద్‌అలీ, వెంకటస్వామి, యాదగిరి, రాజ్‌కుమార్, చందు, ఆలయకమిటి అధ్యక్షులు మల్లేష్, నారాయణ, మొగులయ్య, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**వైకుంఠధామం అభివృద్ధికి శంకుస్థాపన**

**నిజాంపేట..** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో దాదాపు రూ.50లక్షల నిధులతో చేపడుతున్న వైకుంఠధామం అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మేయర్ కొలన్ నీలారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్మశానవాటికను ఒక మోడల్ గ్రేవ్‌యార్డు వైకుంతధామంగా తీర్చిదిద్దుతామని, ఇక్కడకు వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రశాంతమైన వాతావరణం కల్పించే విధంగా పచ్చధనం పెంపు, కూర్చుకునేందుకు వీలుగా వసతి గదులు తదితర సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే వార్డు కార్యాలయాలు : మంత్రి తలసాని



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

ధర్నాచౌక్, ఆగస్టు 30, ప్రభాతవార్త: ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు వార్డు కార్యాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవాలంటే వేరు వేరు ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేశారు. వార్డు కార్యాలయాల ఏర్పాటుతో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎలక్ట్రికల్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, హార్టీకల్చర్ తదితర శాఖల అధికారులు ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉంటారని, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజలందరూ ఎటువంటి సమస్యలు ఉన్నా వార్డు కార్యాలయాలకు వచ్చి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అన్ని శాఖల అధికారులు కూడా ప్రజల నుండి వచ్చే సమస్యలపై సకాలంలో స్పందించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాలలోను ప్రతిభను చాటాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చార్మినార్, ఆగష్టు 30 ప్రభాతవార్త : విద్యార్థులు అన్ని రంగాలలోను తమ ప్రతిభను చాటాలని పురానాపూల్ అఫ్జల్ గంజ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ కుమారి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం, వ్యవహారిక భాషా పితామహులు గిడుగు రామమూర్తి పంతులు జయంతి,హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్క రించుకుని పాఠశాలకు చెందిన విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలు పొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. తెలుగు పండితులు డాక్టర్.ఎస్.విజయ్ భాస్కర్, పిఈటి ఎన్.శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు కౌసర్ పాతిమాతో పాటు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్లార్ఐటిఎంలో ఘనంగా ఓరియంటేషన్ డే





అతిథులను సత్కరిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

దుండిగల్, ఆగస్టు 30 ప్రభాతవార్త : నగరశివారు దుండగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఎమ్మెల్లార్ఐటిఎం) కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఈఫాం సిస్టమ్స్ డైరెక్టర్ శాంతికుమార్, ఐవిఆర్‌సిఎల్ లిమిటెడ్ గ్రూప్ హెడ్ డా.పాండురంగారావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు నాలుగు సంవత్సరాలు అత్యంత కీలకమైనవి అన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించే దిశగా ముందుకెళ్ళాలని సూచించారు. ముఖ్యంగా అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని శాస్త్రీయ విజయాలను సొంతం చేసుకోవాలని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి తోడ్పాడునందించే సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రిన్సిపాల్ డా.కెవి.రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, తమ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్లార్ గ్రూప్ అధినేత, అంతర్జాతీయ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వీరాంజనేయస్వామి ఆలయంకు విరాళం



ఆలయకమిటి సభ్యులకు విరాళం అందజేస్తున్న సంపత్‌గౌడ్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 30 ప్రభాతవార్త : జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయానికి ఎంఎన్‌రెడ్డి కాలనీ ఫేస్-1 వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ,26,501 రూపాయలను విరాళం ప్రకటించారు. ఈమేరకు బుధవారం ఆలయకమిటి సభ్యులకు అసోసియేషన్ అధ్యక్షులు సంపత్‌గౌడ్ విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తమ అసోసియేషన్ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, కర్ణాకర్‌రెడ్డి, బాపిరెడ్డి, విజయ్, బిక్షపతి, రామాంజనేయులు, రవి ముదిరాజ్, మునీశ్వరయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

చార్మినార్, ఆగష్టు 30 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాలలో బుధవారం సిటీ కళాశాల స్టాండర్డ్ క్లబ్,భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హాల్ మార్కింగ్,ఐఎస్ఐ మార్క్‌లపై అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్.విదిశ మాట్లాడుతూ ప్రజలు దైనందిన జీవితంలో వినియోగించే వస్తువులపై భారతీయ ప్రామాణిక సంస్థ ప్రమాణాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.కాగా పోటీలలో గెలు పొందిన విద్యార్థులు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్,సిటీ కళాశాల స్టాండర్డ్ క్లబ్ మెంటర్ డాక్టర్.వై.వాసుదేవరెడ్డి,భౌతిక శాస్త్రం విభాగం అధిపతి డాక్టర్ వినోదిని,తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల ఫోరం అధ్యక్షులు అంబు రాథోడ్,డాక్టర్ పర్వతాలు, డాక్టర్.చిన్నిక్రిష్ణ,డాక్టర్ లక్ష్మీ శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు విద్యా ర్థులు పాల్గొన్నారు.

# బావ బావమరిదికి ఐదు రోజుల జైలు శిక్ష

యాకుత్‌పుర, ఆగష్టు 30 ప్రభాతవార్త : కుటుంబ తగదాలు కారణంగా జరిగిన గొడవలో బావ బావమరిదికి కోర్టు ఐదు రోజులు జైలు శిక్ష విధించిందని రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.మధుసూధన్‌రెడ్డి తెలిపారు.పాతబస్తీకి చెందిన సయ్యద్ మహమూద్ తన సోదరిని బావమరిది అయిన సయ్యద్ ఉస్మాన్ సరిగా చూడటం లేదు.ఈ విషయమై వీరిద్దరి మధ్య గొడవ జరిగింది.ఇరువురు గొడవ పడి కొట్టుకున్నారు.కేసు నమోదు చేసుకుని వీరిద్దరిని కోర్టులో హాజరు పరచగా నాంపల్లి ఆరవ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు సయ్యద్ మహమూద్,సయ్యద్ ఉస్మాన్‌లకు ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధించారని సిఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

నిజాంపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వివిధ ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు వారికి టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. అన్ని ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు, ప్రతి ఏడాది ఒక్కో కార్పొరేషన్‌కు రూ,750కోట్ల నిధుల కేటాయిస్తామన్నారు. బూత్‌స్థాయి కార్యకర్తల నుండి సీనియర్ నాయకులు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రవీందర్, సంజీవరెడ్డి, కనకయ్య, నాగబాబు, శశికళ, రాంబాబు, మధు, పర్వతాలు, కళ్యాణ్‌గౌడ్, వేణుగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మణికంఠ, మల్లేష్ పాల్గొన్నారు.

# ఓటరు నమోదుపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్

కొంపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త: కొంపల్లి పురపాలిక సంఘం పరిధిలోని సెయింట్‌మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల, సాయిచైతన్య డిగ్రీ కళాశాల, సాయితేజ డిగ్రీ కళాశాలల్లో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ఓటరు నమోదు, సవరణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. 18సంవత్సరాలు నిండిన వారు తప్పని సరిగా ఓటరు నమోదు చేసుకోవాలని, ఓటరు సవరణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జూ.అసిస్టెంట్ రంజిత్‌కుమార్, ఆఐ మహేష్‌యాదవ్, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

# షాబాద్ ఫ్లోరింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 30 ప్రభాత వార్త: గాంధీనగర్ డివిజన్‌లోని షాబాద్ ఫ్లోరింగ్ పనులు వేగవంతం గా పూర్తికాకపో వడం పట్ల స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం డివిజన్ పరిధిలోని సబర్మతినగర్ బస్తీలో జరుగుతున్న పనులను బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్, ఏఈ సలామ్, ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పర్యవేక్షించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో రూ.12.50లక్షల వ్యయంతో మొత్తం 5 బస్తీల్లో మేనెలలో పనులను ప్రారంభించడం కాని ఇప్పటివరకు పనులు పూర్తికాకపోవడానికి గల కారణాలేమిటని అధికారులను నిలదీశారు. ఈ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌లపై వత్తిడి పెంచి వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, ఎం.ఉమేష్, సత్తిరెడ్డి, ప్రకాశ్ యాదవ్, దోనేటి సత్యం, అరుణ్‌కుమార్, రవీందర్‌గౌడ్, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

# ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 30 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి నరేంద్రమోడి అభివృద్ధి దిశలో తీసుకువెళ్తున్న గొప్ప నాయకుడని,ముఖ్యంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌పై రెండువందల రూపాయలను తగ్గించడం సంతోషదాయకమని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు.ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌పై రెండు వందల రూపాయలను తగ్గించన సందర్భంగా పుత్లీబౌలి చౌరస్తా సమీపంలో బిజెపి నాయకులతో కలిసి దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్ర పటానికి బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు రాజుయాదవ్, రేణుక,కట్టప్ప,మయూర్‌కుశాల్,రఘు,ప్రవీణ్,బాబు,వినోద్,నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

**ఓయు వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్**



నాన్‌టీచింగ్ హోమ్‌ను పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, ఆగస్టు 30 ప్రభాతవార్త: ఒ.యూ ఉద్యోగుల సంక్షేమం, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. పునర్నిర్మాణం చేసిన నాన్‌టీచింగ్ హోం సముదాయాన్ని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.జి.మల్లేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన మహిళా ఉద్యోగులు వీసీ, రిజిస్ట్రార్‌లకు రాఖీలు కట్టారు. ఓ.యూలో పనిచేస్తున్న మహిళా సోదరీమణులకు ఆచార్య రవీందర్ యాదవ్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఒప్పంద ఉద్యోగులు క్రమబద్దీకరణ విషయమై ప్రభుత్వం నుంచి శుభవార్త కోసం ఎదురుచూద్దామని చెప్పారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు ఇండోర్ గేమ్స్ ఇక్కడ ఏర్పాటు చేశారు. 33 శాతం మహిళలకు వచ్చే ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని నాయకులకు సూచించారు. ఎన్జీవో అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఆచార్య రవీందర్ నేతృత్వంలో తమ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొ.మల్లేషం, ప్రొ.ప్యాట్రిక్, ప్రొ.మంగు నాయక్, డా.చలమల్ల వెంకటేశ్వర్లు, డా. అజీమున్నీసా, ఉద్యోగ సంఘాల నేతలు నాగరాజారావు, శివశంకర్, విజయ్‌కుమార్, అక్బర్ బేగ్, శంకర్ నాయక్, రవి, శంకరయ్య, రాజేశ్వర్, రాజేష్, మెహతాబ్, బిక్షపతి, అశోక్‌తో పాటు పలువురు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, భూగర్భ గనుల శాఖల మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అభినందనలు తెలిపారు

# జనప్రియ బహుళ అంతస్థుల కాంప్లెక్స్‌లో ఓపెన్ జిమ్ ..!

## అధికారులు ఇష్టారాజ్యం : ప్రైవేటు కాంప్లెక్స్‌లో పనులేలా..?



ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి

**ఉప్పల్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని ఒక ప్రైవేటు బహుళ అంతస్థు భవనంలో జిహెచ్‌ఎంసి నిధులతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. కొందరు బడా బిల్డర్లు నిర్మించిన బహుళ అంతస్థు భవనం లోపల నిబంధనలకు విరుద్ధంగా గతంలో పనిచేసిన అధికారులు రోడ్లు వేశారనే కారణంతో ప్రస్తుత అధికారులు ఏకంగా రూ.18లక్షల వ్యయంతో జిమ్ ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు విమర్శలు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో బహుళ అంతస్థు భవనం కొద్ది సంవత్సరాల క్రితం నిర్మించారు. అపార్ట్‌మెంట్ చుట్టూ ప్రహరిగోడ నిర్మించి పూర్తిగా ప్రైవేటు సెక్యూరిటి ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 300వరకు ప్లాట్లను బిల్డర్ల వద్ద కొనుగోలు చేసి స్థానికులు నివాసం ఉంటున్నారు. అయితే అపార్ట్‌మెంట్ బయట జిహెచ్‌ఎంసి వివిధ పనులు చేపట్టాల్సి ఉంది. కాంప్లెక్స్‌లోపల బిల్డర్ ఒక కమిటి ఏర్పాటుచేసి అపార్ట్‌మెంట్ నివాసితుల స్వంత ఖర్చులతో పారిశుధ్య నిర్వహణ, కమ్యూనిటి సెంటర్, జిమ్, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్‌అధికారులు ప్రభుత్వ ధనాన్ని ప్రైవేటు కాంప్లెక్స్ లోపల పనులకు నిధులు ఖర్చు చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కొందరు అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి ఇటువంటి పనులు చేపడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇదే కాంప్లెక్స్‌లోపల గత కొద్ది సంవత్సరాల క్రితం క్రితం బిటి రోడ్డు వేసేందుకు వెళ్లగా అప్పటి అధికారులు సదరు ఇంజనీరింగ్ అధికారిపై వేటు వేశారు. దీనిని సైతం లెక్క చేయకుండా అధికారులు తిరిగి అక్కడే నిధులు వెచ్చించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**ప్రజలందరి కోసమే ఓపెన్ జిమ్ : ఇంజనీర్ నాగేందర్...** రామంతాపూర్ డివిజన్‌కు చెందిన ప్రజలకు ఎప్పుడైనా వెళ్లి జనప్రియ అపార్ట్‌మెంట్ లోపల జిమ్ చేసుకోవచ్చని, అపార్ట్‌మెంట్‌వాసులు వ్యతిరేకిస్తే జిమ్‌ను తొలగిస్తామని మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్ తెలిపారు. ప్రహరిగోడ ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఓపెన్ జిమ్ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించగా సమాదానం దాటవేశారు. అపార్ట్‌మెంట్ బయట కూడ ఒక బోర్డు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.కాగా దీనిపై పలువురు స్థానికులు ఉన్నతాధికారులకు పిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు అక్రమాలకు పాల్పడి కొన్ని ప్రాంతాలను ఎంచుకుని పనులు చేస్తున్నారని వారు ఆరోపించారు.

**స్థలం లేకపోవడం వల్లే కాంప్లెక్స్‌లో జిమ్ : కార్పొరేటర్...** రామంతాపూర్ డివిజన్‌లో ఖాళీస్థలాలు లేకపోవడంవల్ల ప్రైవేటు కాంప్లెక్స్‌లో జిమ్ ఏర్పాటు చేశామని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. డివిజన్‌కు చెందిన ప్రజలందరూ దీనిని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా నోటీసు బోర్డు ఏర్పాటు చేయిస్తామని ఆమె తెలిపారు.

## కేంబ్రిడ్జిలో వేడుకగా రాఖీ సంబరాలు



రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు

**సైదాబాద్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** పండుగలు,ఉత్సవాల ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు చిన్ననాటి నుంచే తెలియజేయాలని కేంబ్రిడ్జి విద్యాసంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ అన్నారు. సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జి పాఠశాలలో బుధవారం విద్యార్థులు రాఖీ పండుగ సంబరాలు నిర్వహించారు. ఉన్నత తరగతుల విద్యార్థినులు తయారు చేసిన రాఖీలను చిన్నారులు ఉత్సాహంగా ఒకరినొకరు కట్టుకుని మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా శంతన్‌కుమార్ మాట్లాడుతూ అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల్ల ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో సిల్వర్ డ్రాప్స్ విద్యార్థుల రక్షా బంధన్ వేడుకలు



పోలీసులకు రాఖీ కడుతున్న సిల్వర్ డ్రాప్స్ విద్యార్థినిలు

**సరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ హై స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినిలు, చిన్నారి బాలికలు పోలీస్‌స్టేషన్‌కువచ్చి పోలీసులకు రాఖీలు కట్టి పండుగ ప్రాముఖ్యతను చాటారు. విద్యార్థులు రాఖీలు కట్టిన సందర్భంగా హర్షం వ్యక్తం చేసిన ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ, పోలీసులు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో-ఆర్డినేటర్ ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 3న జరిగే పద్మశాలి శంఖారావాన్ని విజయవంతం చేయాలి : సంధ్యారాణి



పద్మశాలి శంఖారావం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో సెప్టెంబర్ 3వ తేదీన జరిగే పద్మశాలి శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి విజ్ఞప్తి చేశారు. పద్మశాలి శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కొత్తపేటలోని పివిటి మార్కెట్ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశాలి సమాజ సంక్షేమాభివృద్ధి, రాజ్యాధికార వాటా సాధన లక్ష్యంగా శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పద్మశాలి కుల బాంధవులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిక్కా భారతమ్మ, గర్దాసు చంద్రకళ, వర్ణలీల, చిలుకూరి మాధవి, కర్నాటి మాధవి, పూర్ణిమ, ఉమాశ్రీనివాస్, కైరంకొండ ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు



ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న రఘునందన్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 30 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్ పార్టీలో పార్టీకోసం పని చేసేవారికి ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని మూసారాంబాగ్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు చల్లూరి రఘునందన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిసి రఘునందన్‌రెడ్డి ఆయనకు పుష్ప గుచ్ఛాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలనుండి పార్టీ పటిష్టతకోసం కృషి చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఛైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలి : ట్రాఫిక్ సీఐ శివశంకర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శివశంకర్

**నేరెడ్‌మెట్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోడ్రైవర్లు నియమ నిబంధనలను పాటిస్తూ తమ వాహనాలపై చలాన్లు పడకుండా, ప్రమాదాలనుండి కాపాడుకోవాలని మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. ఈస్ట్‌ఆనంద్‌బాగ్‌లోని ఆర్.ఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆటో డ్రైవర్లకు ఏర్పాటుచేసిన ట్రాఫిక్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని, డ్రైవింగ్ చేసే సమయంలో యూనిఫామ్‌ను ధరించాలని సూచించారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్ళవద్ద ఆటోలు నిలిపి రవాణాకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఆటోలలో ప్రయాణించేటప్పుడు ముందు సీట్లలో డ్రైవర్ తప్పా మరెవరు కూర్చోవద్దన్నారు. దానివాల్ల కొంతమేర ప్రమాదాలను నియంత్రించడం జరుగుతుందన్నారు. జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేసి జరిమానాల బారిన పడవద్దన్నారు. ప్రతి ఒక్కరు వాహన రిజిస్ట్రేషన్, పొల్యూషన్ తదితర పత్రాలను వెంట పెట్టుకోవాలని సూచించారు. ఏ సమయంలోనైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు రామ్మోహన్, నర్సింహ్మలు, ట్రాఫిక్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయకూడదు : కమీషనర్ శ్రీకాంత్

**తుర్కయాంజాల్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో చెత్తను బయట వేయరాదని, ఇంటింటికి చెత్తను సేకరించే స్వచ్ ఆటోకి ఇవ్వాలని కోరారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేస్తే రూ.500 నుండి రూ.10,000వరకు జరిమాన విధిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మసాబ్‌చెరువులో ఇద్దరు వ్యక్తులు చెత్తను వేస్తుండగా, మున్సిపాలిటీ సిబ్బంది వారిద్దరికి, విడివిడిగా 500 రూపాయలు జరిమాన విధించటంతోపాటు తిరిగి చెత్తను వారితోనే ఎత్తించారు. బహిరంగంగా చెత్తను వేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జవాన్లు పాల్గొన్నారు.

## కొత్తపేట డివిజన్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించండి : కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ విద్యుత్‌శాఖ డిఈ రామకృష్ణను కలిసి విద్యుత్ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దశాబ్దాల నాటి విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. శివమ్మనగర్, భరత్‌నగర్, కొత్తపేట గ్రామం, రాజీవ్‌గాంధీనగర్ వివిధ కాలనీలలో వున్నటువంటి పురాతన స్తంభాలు వంగి కూలిపోయే స్థితిలో ప్రమాదకరంగా ఉన్నాయని వెంటనే వాటిని తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రీట్ లైట్ ఇఇ పున్ననాయక్‌ను కలిసి డివిజన్‌లోని చాలా కాలనీలలో టైమర్లు సరిగ్గా పనిచేయడం లేదని, విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేవని మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## మీర్‌పేట్‌లో సానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

**సరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌ను స్వచ్ఛ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా కమీషనర్ వాణి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సానిటరీ ఇన్స్‌పెక్టర్, సూపర్‌వైజర్లు కార్పొరేషన్‌లో తనిఖీలు చేస్తూ రోడ్లపై నిర్లక్ష్యంగా చెత్తను పారబోస్తున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుగురు వ్యక్తులకు రూ.2400 జరిమానా విధించారు. కమీషనర్ వాణి సైతం డివిజన్లలో పర్యటిస్తూ పారిశుధ్యంపై తనిఖీలుచేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయవద్దని కోరారు.

## ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా ప్రదీప్‌రెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా కుడుమల ప్రదీప్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ రామస్వామి పంక్షన్‌హాల్‌లో ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్త కమిటిని ఎన్నుకుంటూ తీర్మానించారు. కమిటి అధ్యక్షునిగా ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా బోరంపేట రాము, మస్తాన్‌లను ఎన్నుకున్నారు. ఉప్పల్‌లో గణేష్ ఉత్సవాలు విజయవంతం చేసేందుకు తన వంతు కృషి చేస్తామని ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి ముఖ్య సలహాదారులు చింతల నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు టంటం వీరేష్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌కు నిధులు కేటాయించండి : బన్నాల గీత

**ఉప్పల్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మల్టీపర్పస్ కమ్యూనిటి హాల్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. బీరప్పగడ్డలో సివరేజ్ లైన్ వేసిన ప్రాంతంలో సిసి రోడ్డు పనులు, అదే విధంగా సీనియర్ సిటిజన్ నిధులు కేటాయించాలని విన్నవించారు. దీనిపై జోనల్ కమిషనర్ పంకజ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బేతి



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో రూ.50లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జనప్రియలో రూ.15లక్షలతో ఓపెన్ జిమ్, మరో రూ.32లక్షలతో సిసి రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. డివిజన్ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ ఎల్.నాగేందర్, డిఇ నాగమణి, ఎఇ కీర్తిశ్రీ, బిఆర్‌ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, నిశాంత్, నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని వంటగ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకున్నారని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. గ్యాస్ ధర తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మోడీ చిత్రపటానికి ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంవద్ద కార్పొరేటర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. పంపిణీ చేసి, బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అక్కచెల్లెలందరికీ మోదీ రక్షాబంధన్ కానుక అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు సురేష్‌నేత, మందుల శ్రీధర్‌రాజ్, చక్రాల వెంకటేష్, సురేష్, నరసింహారెడ్డి, ప్రవీణ్ పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మక స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడలకు లార్డ్స్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ సిద్దాల బీరప్ప

**సరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రతిష్టాత్మక స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెలక్షన్ ప్రక్రియలో లార్డ్స్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ సిద్దాల బీరప్ప విద్యార్థులను అభినందించారు. **ఘనంగా రక్షా బంధన్ వేడుకలు...** లార్డ్స్ హై స్కూల్‌లో జరిగిన రాఖీ పండుగ వేడుకల్లో విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టి పండుగ ప్రాముఖ్యతను చాటారు. అదే విధంగా వారు పాఠశాల ఛైర్మన్ సిద్దాల బీరప్పకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్సీ విభాగం కన్వీనర్‌గా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌కు నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న ప్రితం తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోనగిరి చంద్రశేఖర్ టిపిసిసి ఎస్సీ విభాగం కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు టిపిసిసి ఎస్సీ విభాగం ఛైర్మన్ నగరిగారి ప్రితమ్ నియామకపు ఉత్తర్వులను జారీ చేసారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనకు బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. ఎస్సీలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, టిపిసిసి ఎస్సీ విభాగం ఛైర్మన్ ప్రీతమ్, టిపిసిసి కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు రామ్‌శెట్టి నరేందర్, కేశవ్‌రావు పటేల్‌ల సహాయ సహకారాలతో క్రింది స్థాయినుండి నాయకులు, కార్యకర్తలను కలుపుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారంకోసం కృషి : సాయికిరణ్



కాప్రా డిసికి వినతిపత్రం సమర్పిస్తున్న గడ్డం సాయికిరణ్ తదితరులు

**కుషాయిగూడ, ఆగస్టు 31 ప్రభాతవార్త :** కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే క్రమంలో కృషి చేస్తామని బిజెపి ఉప్పల్ నియోజకవర్గ నాయకులు గడ్డం సాయికిరణ్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని సాయి ప్రియ కాలని, అశోక్‌నగర్, ఎల్లారెడ్డిగూడ, ధాభా గార్డెన్, కట్ట మైసమ్మరోడ్డు, పలు కాలనిల్లో పర్యటించి స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను కాలనీవాసులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయి కిరణ్ మాట్లాడుతూ 6 నెలల నుండి వీధి దీపాలులేక, ఉన్న దీపాలు వెలగకపోవడంతో కాలనివాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిసి ముకుందరెడ్డి, డిఇ లకు వినతి పత్రం అందజేశారు. వెంటనే వారు స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపడతామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాగి వెంకట్‌రెడ్డి, పారుపల్లి హనుమంతరావు, మంజునాథ, విజయ్‌కిరణ్, సిద్దార్థ, నిధీష్ మల్లికార్జున, తరుణ్‌సింగ్, ఉదయ్, పీసరి శంకర్, ఆవుల సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, గడ్డం వెంకట్ సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జయకృష్ణ ఎన్‌క్లేవ్‌లో నూతన కమ్యూనిటీ హాల్ భవన ప్రారంభం : ఎమ్మెల్యే దేవిరెడ్డి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త :** హస్తినాపురం డివిజన్ పరిదిలోఓని జయకృష్ణ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో ప్రతిడివిజన్‌లో రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన సత్తు వెంకటరమణారెడ్డి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, జయ చంద్రారెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ కమలాసుధీర్‌రెడ్డి, డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్యంచారి, ముద్ద కళ్యాణ్, నారగోని శ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, నర్సింహ్మారెడ్డి, మోహన్‌గౌడ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న కాలనీ సంఘాల నాయకులు

**తుర్కయాంజాల్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చెవుల దశరథ ఆధ్వర్యంలో కాలనీసంఘాల అధ్యక్షులు, కాలనీవాసులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబి వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, జగన్నాథం, చెక్క బాల్ నర్సింహా, చెక్క సుధాకర్,నా గేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, జగన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీగా వంటగ్యాస్ ధరల తగ్గింపు: అందెల



మోడీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** వంట గ్యాస్ ధరను భారీగా తగ్గించి మహిళలకు ప్రధాని మోడి రక్షాబంధన్ కానుకిచ్చారని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మోడీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.200, ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉన్న కనెక్షన్లకు రూ.400 తగ్గించడంతో హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అందెల ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధర కొద్దిగా పెరిగితేనే యాగి చేసిన బిఆర్‌ఎస్ పాలకులు భారీగా తగ్గడంపై కూడా స్పందించాలని డిమాండ్ చేశారు. కోట్ల మంది మహిళలకు మేలు చేసేలా ప్రధాని గ్యాస్ ధరలను తగ్గించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, గౌర రమాదేవి శ్రీనివాస్, బంగారు అనితారాణిప్రభాకర్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, జెనిగె పద్మ అయిలయ్య యాదవ్, పార్టీ నాయకులు ఏనుగు రాంరెడ్డి, గడ్డం వెంకటేశ్, జోరల ప్రభాకర్, జక్కిడి జంగారెడ్డి, చిత్రం శ్రీనివాస్,మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పరిశీలన : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ఈస్ట్‌ఆనంద్‌బాగ్ డివిజన్ వసంతపురి కాలనీలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులను త్వరగా పరిష్కరించాలని కోరడంతో కాలనీలో కార్పొరేటర్ పర్యటించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం 20లక్షల రూపాయలతో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్‌నాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, బాబు, సత్యనారాయణ, సంపత్, కిషోర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల అభివృద్ధికి కృషి : కుమార్

**నేరెడ్‌మెట్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** బహుజనవర్గాల అభివృద్ధి చెందినప్పుడే బంగారు తెలంగాణ అవుతుందని రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షులు కుతాడి కుమార్ పేర్కొన్నారు. బుధవారం యాప్రాల్‌లోని ఆయన నివాసంలో గద్దర్‌కు నివాళులర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ ఎరుకల సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీల్లో రిజర్వేషన్ కల్పించడమే కాకుండా జనరల్ స్థానాల్లో మల్కాజిగిరి నియోజకవర్గంనుండి పోటీ చేయడానికి అవకాశం కల్పించడమే కాకుండా ఎరుకల సామాజిక వర్గానికి చట్టసభల్లో స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్గొండ శ్రీనివాస్, మదనపురం సత్యనారాయణ, శేఖర్, వెంకటేష్, శ్రీనివాస్, రమేష్, నరసింహ్మా, లింగయ్య, వినోద్ కుమార్, మల్లికార్జున్, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్ ప్రభుదాస్

**కుషాయిగూడ, ఆగస్టు 31 ప్రభాతవార్త :** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మీర్పేట్ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో రోడ్ నెం.3లో మంచినీటి పైప్ లైన్ పనులను పరిశీలించిన స్థానిక కార్పొరేటర్ ప్రబుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ కాలనీ ప్రజలకు మంచినీటి కష్టాలు లేకుండా చేయడమే కాకుండా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స ఏఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాఖీ ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారి విద్యాలయం దిల్‌సుఖ్‌నగర్‌శాఖనుంచి ప్రసన్నవారి బృందం పుల్లారావు బుధవారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద గుప్తాకు రాఖీలను అందజేశారు. అదేవిధంగా కొత్తపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.విజయరంగ, జివిఆర్ కరాటే అకాడమీ నిర్వాహకుడు జీవి.గోపాల్ రెడ్డిలకు ఆమె రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నాగోల్‌లోని ఉప్పల నివాసంలో రాష్ట్ర టూరిజం మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాకు బుధవారం బ్రహ్మకుమారి ప్రసన్నసుజాత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లారావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.